క్లుప్తంగా

12న మహా అన్నదానం

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి సిరిమానోత్సవం తర్వాత ఆలయ ఆవరణలో నిర్వహించే భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఈ నెల 12న నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేఎల్.సుధారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న మంగళవారం నిర్వహించాల్సిన అన్నదాన కార్యక్రమం తుఫాన్ హెచ్చరికల కారణంగా రద్దు చేసి 12న నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులందరూ విషయాన్ని గ్రహించాలని కోరారు.

ఆర్యవైశ్య వన సమారాధన వాయిదా

విజయనగరం: పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జరగాల్సిన కార్తీక వనసమారాధన తుఫాన్ నేపథ్యంలో 12వ తేదీకి వాయిదా వేసినట్లు నిర్వాహకుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సంఘ సభ్యులకు ఇబ్బంది రాకూడదనే ఉద్దేశంతోనే వాయిదా వేశామన్నారు. ఆయనతో పాటు సంఘ అధ్యక్షుడు వెత్సా సత్యనారాయణమూర్తి, కార్యదర్శి మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, రాంజీ, కొత్త నరసింహం, రామారావు, పెంటపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముస్లిం సోదరుల దీపాల పండుగ



మధార్ ఔలియా చందోత్సవంలో ముస్లిం సోదరులు

విజయనగరం టౌన్: హజరత్ జిందేషా మధార్ ఔలియా చందోత్సవం సందర్భంగా చిరాఖ లపూజా (దీపాల పండుగ) ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఫూల్‌బాగ్ దారిలో ఉన్న మసీద్‌లో మహ్మద్ ఇక్బాల్ షేక్ యాసిన్ సయ్యద్ నిజామ్, పూజారి మహ్మద్ జావిద్ రజా మహ్మద్ యూనస్ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు, సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రక్తదానం గొప్పది..



రక్తదానం చేస్తున్న రక్తదాతలు

విజయనగరం ఫోర్ట్: అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని 43వ వార్డు కార్పొరేటర్ సత్యవతి అన్నారు. నావికా దళ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక న్యూలైఫ్ బ్లడ్ సెంటర్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు బి.రామకృష్ణారావు 179 వ సారి రక్తదానం చేశారు. కార్యక్రమంలో రమణ, శివశంకర్, అబ్దుల్ రవూఫ్, తదితరులు పాల్గొన్నారు.

రాకోడులో గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న ఆడిట్ బృంద సభ్యులు

విజయనగరం రూరల్: మండలంలోని రాకోడులో 2023-24 సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి ఆదివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన సభలో సోషల్ ఆడిట్ బృందం పనులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాటిపి రెడ్డి వెంకటరమణ, ఆడిట్ బృంద సభ్యులు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర కలశాభిషేకం



లింగాకృతిలో ఉన్న కలశాలకు పూజలు చేస్తున్న అర్చకులు

విజయనగరం టౌన్: పట్టణంలోని బాబామెట్ట ఏడుకోవెళ్లలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం సహస్ర కలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ అభిషేకం వల్ల జాతకరిత్యా, గోచార రిత్యా కలిగిన శారీరక, మానసిక దోషాలు తొలగిపోతాయని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి శర్మ, సూర్యతేజ శర్మ, వినయ్ శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు కేవీపీ రాజు, కార్యదర్శి పి.శివకుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సిద్ధమైన శివాలయాలు

రాజాం: పరమ పవిత్రమైన కార్తీకమాస మూడో సోమవారం పూజలకు పట్టణంలోని కూరాకుల వీధిలోని రామలింగేశ్వర శివాలయం, మల్లికార్జునస్వామి ఆలయం, గురవాం, పొగిరి, కంచరాం, పొనుగుటివలస ప్రాంతాల్లో శివాలయంలు సిద్ధమయ్యాయి. ఆలయాలను విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేశారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీఓ



విజయనగరం రూరల్: బీఎల్ఓలతో మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యకళ



భోగాపురం: దల్లిపేట పోలింగ్ కేంద్రంలో తహసీల్దార్ బంగార్రాజు , తదితరులు



పూసపాటిరేగ: పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ భాస్కరరావు

విజయనగరం రూరల్: విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు చేపడుతున్న ఓటరు నమోదు ప్రక్రియను ఆర్డీఓ సూర్యకళ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని గాజులరేగ, కంటోన్మెంట్, వీటీ అగ్రహారం ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, ఓటరు నమోదు ప్రక్రియపై బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఎటువంటి ఒత్తిడులకు తలొగ్గకుండా, పారదర్శకంగా ఓటరు నమోదు, తొలగింపుల ఫారాలను తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో 166 మంది బీఎల్ఓలు పాల్గొనగా, ఫారం-6 దరఖాస్తులు 1112, ఫారం- 7 దరఖాస్తులు 249, ఫారం- 8 దరఖాస్తులు 667 స్వీకరించినట్లు ఎన్నికల అధికారులు ఆమెకు తెలిపారు. ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ సంజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ..

పూసపాటిరేగ: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఇ.భాస్కరరావు సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో కొత్త దరఖాస్తులు, తొలిగింపులను పరిశీలించారు. చింతపల్లి, పూసపాటిరేగ పోలింగ్ బూత్‌లను కూడా పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

నెల్లిమర్లలో..

నెల్లిమర్ల నగర పంచాయతీలో తహసీల్దార్ డి.ధర్మరాజు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. కొత్తగా వచ్చిన దరఖాస్తులపై ఆరా తీసి పలు విషయాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

18 ఏళ్లు నిండిన వారందరూ..

భోగాపురం: పద్దెనిమిది సంవత్సరాలు నిండిన యువత ఓటుహక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ చింతా బంగార్రాజు అన్నారు. మండలంలోని దల్లిపేట, ఎ. రావివలస, పోలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు క్యాంపులను ఆయన పరిశీలించారు. నూతన ఓటు నమోదుపై దృష్టి సారించాలని, చేర్పులు, మార్పులపై ఓటర్లకు అవగాహన కల్పించాలని బీఎల్ఓలకు సూచించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ..



మహంతి కల్యాణి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



మద్దిల శ్రీను కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ (నెల్లిమర్ల): నెల్లిమర్ల మండలం జరజాపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మద్దిల శ్రీను మృతి చెందడంతో ఆయన భౌతికకాయాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదివారం సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ యోగక్షేమాలు తెలుసుకుని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, తదితరులు ఉన్నారు. అలాగే పూసపాటిరేగ మండలంలోని రెల్లివలసలో ఎంపీపీ మహంతి కల్యాణి చినమావయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● పింఛన్ అందజేత



విజయనగరం జిల్లా విజయనగరం మండలం చెల్లూరు గ్రామానికి చెందిన వృద్ధురాలు కరణపు అప్పయ్యమ్మ అనారోగ్యం బారిన పడి విశాఖలో తన కుటుంబీకుల ఇంట్లో ఉండడంతో వలంటీరు బోడసింగి వెంకటలక్ష్మి ఆదివారం విశాఖ వెళ్లి పింఛన్ అందజేస్తున్న చిత్రం

సంక్షేమ పథకాలపై ప్రచారం

రాజాం సిటీ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అధికారులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. మండల పరిధి నందబలగలో వికసిత భారత సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలతో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు. గ్యాస్ కనెక్షన్లు, ఉపాధి హామీ పథకం, హౌసింగ్ స్కీమ్‌లపై ఎంపీడీఓ బాసూరి శంకరరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



దివ్యాంగులతో ర్యాలీ నిర్వహిస్తున్న హీల్ ప్రాజెక్ట్ ప్రతినిధులు

విజయనగరం టౌన్: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని హీల్ ప్రాజెక్ట్ ప్రతినిధి తాలాడ దీప్తి అన్నారు. చెల్లూరులో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కష్టపడి చదివి ఉత్తీర్ణత సాధించేందుకు వైకల్యం అడ్డురాదన్నారు. దివ్యాంగులు ముఖ్యంగా వారి హక్కులను తెలుసుకోవాలన్నారు. వీరికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వలంటీర్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



ఆరోగ్యశాఖపై సమీక్షిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- ఎంపీ బెల్లాన, శాసనమండలి విప్ విక్రాంత్, ఎమ్మెల్యే జోగులు

రేగిడి: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలనిఎంపీ బెల్లాన, శాసనమండలి విప్ విక్రాంత్, ఎమ్మెల్యే జోగులు అధికారులకు సూచించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రజా ప్రతినిధులు ప్రజలకు వివరించాలన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, శాసనమండలి విప్ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు పలు శాఖల అభివృద్ధి, ఇటీవల నిర్వహించిన కార్యక్రమాలపై ఆరా తీశారు. అనంతరం ఆరోగ్యశాఖపై జరిగిన చర్చలో ఇటీవల జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంచి ఫలితాన్ని ఇచ్చిందని వెల్లడించారు. మెరుగైన వైద్యం, ఆపరేషన్లు నిమిత్తం పెద్దాస్పత్రిలకు తరలించిన రోగులపై దృష్టి సారించాలని వైద్యాధికారి సోహినీరాఘవ్‌కు సూచించారు. ఉపాధిహామీపై జరిగిన సమీక్షలో మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభించాలన్నారు. 11 పంచాయతీల్లో పనులు ప్రారంభించినట్లు ఏపీఓ ఎస్.హరనాథరావు తెలిపారు. విద్యపై ఎంఈఓ బి.ఎరకయ్య, తాగునీటిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్, వ్యవసాయశాఖపై వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ, పంచాయతీరాజ్‌పై ఏఈ రామకృష్ణ, రెవెన్యూపై తహసీల్దార్ సుదర్శనరావు, మహిళా సంఘాల అభివృద్ధిపై ఏపీఎం వై. గోవిందరావు మాట్లాడుతూ, తమ శాఖల ద్వారా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ శ్యామల కుమారి, తహసీల్దార్ సుదర్శనరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎంపీ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హేమలత

వినతిపత్రం అందజేత

బాడంగి: చీపురుపల్లిలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను ఏఐజీడీఎస్ యూనియన్ ప్రత్యేక ఆహ్వానితురాలు, పాల్తేరు బీపీఎం ఆర్.హేమలత ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె గ్రామీణ డాక్ సేవక్‌ల సమస్యలను ఎంపీకి వివరించారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నామని తెలిపారు. స్పందించిన ఎంపీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

దివ్యాంగులకు అండగా చిన్న శ్రీను సోల్జర్స్

- సంఘ అధ్యక్షురాలు సిరిసహస్ర



దివ్యాంగులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న చిన్న శ్రీను సోల్జర్స్ సంఘ అధ్యక్షురాలు సిరి సహస్ర

విజయనగరం: అవయవలోపం ఉన్నా నేటి సమాజంలో అద్భుతాలు సృష్టిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న దివ్యాంగులకు చిన్న శ్రీను సోల్జర్స్ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సంఘ అధ్యక్షురాలు సిరిసహస్ర అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కణపాక యూత్ హాస్టల్‌లో స్పందన దివ్యాంగ సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఎంవీఎస్ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, దివ్యాంగులకు సేవలందిస్తున్న 15 స్వచ్ఛంద సేవా సంస్థలను గుర్తించి సత్కరించారు. అలాగే నైపుణ్యం కలిగిన 10 మంది దివ్యాంగులను సత్కరించి, మెమొంటోలు అందజేశారు. అనంతరం 100 మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. దివ్యాంగులకు ఎటువంటి సహాయం కావాల్సినా చిన్న శ్రీను సోల్జర్స్ సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న దివ్యాంగులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో స్పందన దివ్యాంగ సంస్థ అధ్యక్షుడు కందివలస సురేష్ , హ్యూమన్ రైట్స్ ప్రతినిధి సంతోష్, చిన్న శ్రీను సోల్జర్స్ ఉప అధ్యక్షుడు తోట వాసు, కార్యదర్శి జాకీర్ హుస్సేన్, రామకృష్ణ, శ్రీనివాస్, జగదీష్, శివ, అభిరామ్, తదితరులు పాల్గొన్నారు.

సారథి వెల్ఫేర్ సొసైటీకి ఇన్వర్టర్, బ్యాటరీ వితరణ



ఇన్వర్టర్, బ్యాటరీ గ్యారెంటీ కార్డులు అందజేస్తున్న దాతలు

విజయనగరం: క్షత్రియ పరిషత్ విజయనగరం జిల్లా శాఖ ప్రతినిధులు స్థానిక సారథి వెల్ఫేర్ సొసైటీ అంధ విద్యార్థులకు రూ. 24 వేల విలువ చేసే ఇన్వర్టర్, బ్యాటరీలను వితరణగా అందజేశారు. పరిషత్ అధ్యక్షుడు ఎస్ఎస్ఎన్ రాజు, కార్యదర్శి పెనుమత్స సీతారామరాజు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా గొట్టిముక్కల రామరాజు, సాగి శివాజీరాజు మాట్లాడుతూ, పీవీజీ రాజు శత జయంతి వేడుకల్లో భాగంగా ప్రతి నెలా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. సారథి వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకుడు ప్రదీప్ మాట్లాడుతూ, 35 మంది డిగ్రీ, పీజీ విద్యార్థులు ఈ సొసైటీ ద్వారా చదువుకుంటున్నారని.. వీరికి దాతలు ఇచ్చిన విరాళాలు మినహా ఎటువంటి సహాయ సహకారాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో విద్యార్థులు చదువుకోవడానికి లైబ్రరీ, కంప్యూటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జీఎస్ఎన్ రాజు, చిట్టిబాబు, కేవీఎస్ఎన్ రాజు, రామచంద్ర రాజు, డీఎస్పీ లింగం యూత్ పరిషత్ సెక్రటరీ లక్ష్మీపతి వర్మపాల్గొన్నారు.

ఉచిత సేవలు అందించడమే లక్ష్యం



వైద్య పరీక్షలకు హాజరైన రోగులు

విజయనగరం: ప్రజలందరికీ అవసరమయ్యే ఆరోగ్య సేవలు ఉచితంగా అందించడమే తమ లక్ష్యమని విజయనగరం రోటరీ ప్రధాన క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కె. కృష్ణకాంతి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో రోటరీ ఆధ్వర్యంలో వయోవృద్ధులు, వాకర్స్ సభ్యులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణకాంతి మాట్లాడుతూ, స్థానిక తిరుమల మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఖరీదైన వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని, అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు ప్రవీణ్ అంచాలియా, మాటూరు మురళీకృష్ణ, సూర్యలక్ష్మి, డాక్టర్ రాధికారాణి, మంజుల, నీతా విజ్ఞాని, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



సమావేశమైన పూర్వ విద్యార్థులు

భోగాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (1996-97 పదో తరగతి బ్యాచ్) చదువుకున్న పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత రాజాపులోవ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. ఎవరెవరు ఏయే రంగాల్లో స్థిరపడినదీ చెప్పుకుంటూ రోజంతా సరదాగా గడిపారు.

చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు

- ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: చివరి గింజ వరకు ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందని, దళారుల బారినపడి రైతులు మోసపోవద్దని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని పిరిడి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ, ఎమ్మెల్యే కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం వారు తేమశాతం లెక్కించే పరికరాలు, కొనుగోలు యంత్రాలు పరిశీలించి, అవి పనిచేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే రైతులు నష్టపోకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని సూచించారు. సాధారణ వరి రకం క్వింటా రూ.2183కు, గ్రేడ్-ఏ రకం క్వింటా రూ.2203కు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన వారం రోజుల్లోగా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలన్నారు. మిచాంగ్ తుపాను నేపథ్యంలో అధికారులు, రైతులు అప్రమత్తం కావాలని, పంట నష్టం జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, సర్పంచ్ తుట్ట వరలక్ష్మి, పౌర సరఫరాల ఉప తహసీల్దార్ రెడ్డి సాయికృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

రామభద్రపురం: మిచాంగ్ తుపాను నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో వెంకటయ్య సూచించారు. మండలంలోని రామభద్రపురం, కొండకెంగువ, తారాపురం గ్రామాలను ఆదివారం సందర్శించిన ఆయన అక్కడి వ్యవసాయ పొలాలకు వెళ్లి, తుపాను కారణంగా రైతులు నష్టపోకుండా ఉండేందుకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు తుపాను ప్రభావం ఉంటుందని, భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. నూర్పిడి చేసిన పంటను సమీపంలోని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. అలాగే కోసిన వరి ఫనలను చిన్నచిన్న గాలి దిబ్బలుగా వేసుకోవాలని, దిబ్బలు చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా బట్టీలు తీసుకోవాలన్నారు. కోసిన వరి పంట ఫనలను దిబ్బలు వేయకపోతే ఫనలపై ఉప్పు ద్రావణం పిచికారీ చేయడం గానీ ఉప్పును చల్లడం గానీ చేయాలన్నారు. ఇలా అయితే వర్షానికి తడిచినా గింజ రంగుమారదని, నాణ్యంగానే ఉంటాయన్నారు. పత్తి ఏరేందుకు సిద్ధంగా ఉంటే వర్షం పడకముందే ఏరుకుంటే మంచిదన్నారు. కార్యక్రమంలో వీఏఏలు అప్పలనాయుడు, శర్మ తదితరులు పాల్గొన్నారు.

● సందడిగా వనభోజనాలు



రాజాం: గెడ్డవలస తోటలో వనభోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగులు, తదితరులు

రాజాం: పట్టణ పరిధిలోని పాలకొండ, చీపురుపల్లి రోడ్డులలో పలు సంఘాలు, సంస్థలు, పాఠశాలలు ఆదివారం వనభోజన కార్యక్రమాలు నిర్వహించాయి. మండలంలోని గెడ్డవలసలో బూరాడ చండీరాంప్రసాద్, ముదిలి జనార్ధనరావులతో పాటు అయ్యప్ప భక్తులు లక్ష్మీయూత్ ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించి సహపంక్తి భోజనాలు చేశారు. అలాగే మరికొంతమంది వనభోజనాలు ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాలన్నీ సందడిగా మారాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులుతో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వంగర మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, తదితరులు పాల్గొన్నారు.